క్లుప్తంగా

కొనసాగుతున్న డిగ్రీ కాలేజీల నిరవధిక బంద్



బంద్‌లో పాల్గొన్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు చేపట్టిన నిరవధిక బంద్ మంగళవారం కొనసాగింది. ప్రభుత్వాలు మూడేళ్లుగా కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల నిర్వహణ భారంగా మారిందని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కోఆర్డినేటర్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. కాలేజీలకు సంబంధించిన కరెంటు బిల్లులు, ఇతర పన్నులు, సిబ్బందికి వేతనాలు చెల్లించక అవస్థలు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు.

ఆలయానికి వాటర్ కూలర్ అందజేత



వాటర్ కూలర్ అందజేస్తున్న దాతలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం దాతలు వాటర్ కూలర్‌ను ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సనాతన ఐటీ కంపెనీ ప్రతినిధులు యర్ర శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథరాజు తమ తాత కంచనపెల్లి రామచంద్రరాజు, లలితాదేవి, (బట్టు పంతులు) జ్ఞాపకార్థం ఆలయానికి వాటర్ కూలర్ అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, గుండారం, నాగారం గ్రామాలకు చెందిన పలు బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సానా సురేశ్, గుండారంకు చెందిన బొల్లపెల్లి శంకర్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగారం గ్రామానికి చెందిన పెండ్లి నారాయణను పరామర్శించారు. మాజీ జెడ్పీటీలు మేకల సంపత్, ఉప్పరి శ్రీనివాస్, తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్‌గౌడ్, ఎలబోయిన రామ్మూర్తి, రాజ్‌కుమార్ ఉన్నారు.

ప్రతీ కూలీకి ఉపాధి పని కల్పించాలి

ముత్తారం: గ్రామంలో ప్రతీ కూలీకి ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని ఎంపీడీవో సురేశ్ సూచించారు. మండలంలోని ఓడెడ్‌లో మంగళవారం ఉపాధిహామీ పనులపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ పనులు అవసరమో నివేదిక సమర్పించాలని ఉపాధి అధికారులు, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, నాయకుడు దాసరి చంద్రమౌళి, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకా

ఓదెల: మండలంలోని ఓదెల నాంసానిపల్లి, లంబాడితండా గ్రామాల్లో పశువులకు డాక్టర్ మల్లేశం మంగళవారం గాలికుంటు నివారణ టీకా వేశారు. వివిధ గ్రామాలకు చెందిన 200 పశువులకు టీకా వేశారు. గోపాలమిత్రలు మహేశ్, ప్రవీణ్, ఓదెలు, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ఎలిగేడు మండలంలో..

ఎలిగేడు: గేదెలు(బర్రెలు), ఆవులు, ఎద్దులకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలని ఎలిగేడు మండల వెటర్నరీ వైద్యురాలు ఝాన్సీ సూచించారు. మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకా ప్రారంభించారు. ఈనెల 15 నుంచి మండలంలో నెలరోజుల పాటు గాలికుంటు నివారణ టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు. ర్యాకల్‌దేవుపల్లిలో 122 పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. పశుమిత్ర పెద్ది సమ్మయ్య, పశు పెంపకందారులు పాల్గొన్నారు.

నివాసాలను కమ్మేస్తున్న దుమ్ము

- శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- ఓవర్ లోడ్, అధిక వేగమే కారణం
- అధికారులు దృష్టిసారించాలని స్థానికుల వినతి



వాహనాలు వెళ్లడంతో లేస్తున్న దుమ్ము (ఫైల్)

సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ క్రాస్ రోడ్ నుంచి సుభాష్‌నగర్ వరకు వెళ్లే రహదారి చుట్టుపక్కల వ్యాపారులు, ప్రజలు దుమ్ము, ధూళితో శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వాటర్ క్యూరింగ్‌తో పాటు పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఓవర్ లోడ్ లారీలు, ఇతర వాహనాలతో లేస్తున్న దుమ్ముతో ఇబ్బందులు వస్తున్నాయని వాపోతున్నారు. అయితే మైనింగ్ అధికారులు రోడ్డును క్యూరింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ చేయకపోవడంతో దుమ్ము లేచి దుకాణాల్లోని వస్తువులు, సామగ్రిపై చేరుతోందని చెప్తున్నారు. అధికారులు కనీసం స్పందించి పరిశీలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు గుంతలమయం..

సుల్తానాబాద్ మండలం మానేరు వాగు నుంచి ఇసుకను పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా గుంతలు పడడంతో రాత్రివేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై వెళ్లడంతో బైక్‌లు దెబ్బతినడంతో పాటు రాత్రివేళలో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ఓవర్ లోడ్ వాహనాలు వెళ్లడంతో గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు అంటున్నారు. రాజీవ్ రహదారి వెంబడి వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయం అయ్యాయి. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని స్వప్నకాలనీ సమీపంలో, పూసాల రోడ్డు ఎదురుగా సుగ్లాంపల్లితో పాటు పలు ప్రాంతాలలో గుంతమయం అయ్యాయి. కాగా మరమ్మతు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. కాగా దీనిపై అధికారులను వివరణ కోరగా త్వరలో వర్షాలు ఉన్నాయని, వర్షాలు పూర్తిగా నిలిచిన తర్వాత మరమ్మతు పనులు ప్రారంభిస్తామని వివరించారు.

రాత్రివేళల్లో ప్రమాదాలు



రహదారిపై భారీ వాహనాలు, లారీలు వెళ్లడంతో దుమ్ము, ధూళి అధికంగా వచ్చి దుకాణదారులకు శ్వాసకోస సమస్యలు, వ్యాధులు వస్తున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేయకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సూర శ్యాం, శాంతినగర్, సుల్తానాబాద్

శుభ్రం చేయించాలి



నిత్యం వాటర్ క్యూరింగ్‌తో పాటు ఇసుక రీచ్‌లు పొందిన వారు నిత్యం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లారీలు ఇతర వాహనాలు రోడ్డుపై వెళ్లడంతో దుమ్ముతో సమస్యలు వస్తున్నాయి. మైనింగ్ అధికారులు రోడ్డును క్యూరింగ్ చేయించాలి.

– రాజేంద్రప్రసాద్, గాంధీనగర్, సుల్తానాబాద్

త్వరలో పనులు ప్రారంభం



వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. టెండర్లు పూర్తయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు అధికారులతో కలిసి రోడ్డును సందర్శించారు. వెడల్పు కొలతలు తీయడంతో ఎక్కడి వరకు రోడ్డు తీయవచ్చు అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరలో వేగవంతం కానున్నాయి.

– ఆకుల వెంకటేశ్, ఇన్‌చార్జి కమిషనర్, సుల్తానాబాద్

కార్మికుల్లో ఐక్యత కోసమే బడాఖాన



బడాఖాన ప్రారంభిస్తున్న మేయర్, జీఎం

గోదావరిఖని: కార్మికుల మధ్య ఐక్యత కోసమే గనులపై ప్రభుత్వం బడాఖాన ఏర్పాటు చేయించిందని రామగుండం మున్సిపల్ మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీడీకే–5 ఓసీపీలో మంగళవారం బడాఖాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిని కాపాడుకుంటే భవిష్యత్‌లో ఇక్కడున్న యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా ఇప్పించారన్నారు. మిగులు లాభాలతో ఈప్రాంతంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక్కడున్న పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించేలా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వినిప్రకాశ్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ అనిల్‌గబాలే, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరించారు. అలాగే సీఎస్పీలో బడాఖాన నిర్వహించారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

కలలు కనండి.. సాకారం చేసుకోండి



వివిధ వేషధారణలో చిన్నారులు

పెద్దపల్లిరూరల్: కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ అబ్దుల్‌కలాం ఇచ్చిన సందేశం విద్యార్థులను ఎంతో ప్రభావితం చేసిందని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ అన్నారు. పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం యాంబిషన్‌డే నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులంతా తమ భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా వేషధారణతో వచ్చి అలరించారు. తాను డాక్టర్ నవుతానంటూ స్టెతస్కోప్‌తో, మిలటరీ, పోలీసు అధికారి అవుతానంటూ యూనిఫాంలో వచ్చి అలరించారు. ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దిన్, సృజన, స్రవంతి ఉన్నారు.

పది రూపాయల కాయిన్ వినియోగించుకోవాలి



ప్రచారం చేస్తున్న చీఫ్ మేనేజర్ శివ, సిబ్బంది

ధర్మారం: ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.పది కాయిన్ చెల్లుబాటు అవుతుందని, ప్రతీఒక్కరు వాటిని వినియోగించుకోవాలని ధర్మారం యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రచారం చేశారు. మండల కేంద్రంలోని వ్యాపార దుకాణాలలో మంగళవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ శివ, సీఎస్‌ఏ హేమంత్‌రెడ్డి, ఆఫీస్ అసిస్టెంట్ ఎల్లయ్య పర్యటించారు. వారు దుకాణదారులతో మాట్లాడుతూ పది రూపాయల కాయిన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 10 దుకాణాలలో పది రూపాయల కాయిన్‌లు పంపిణీ చేశారు.

రేపు జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలను ఈనెల 17న పెద్దపల్లిలోని ఎంఈవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈవో మాధవి తెలిపారు. గత నెలలో మండలస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన వారు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆరు అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారు నవంబర్ 1న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని వివరించారు.



రామగుండం: సన్మానిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు



జ్యోతినగర్: ట్రాన్స్‌కో అధికారులకు సన్మానం

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం

రామగుండం: విద్యుత్ విభాగంలో విధులు నిర్వహించి ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ట్రాన్స్‌కో అధికారులను మంగళవారం సన్మానించారు. రామగుండం సబ్‌స్టేషన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఏఈ దామోదర్‌రావు, శంకరయ్య, నవీన్, శ్రీను, వెంకటస్వామిని ట్రాన్స్‌కో అధికారులు లక్ష్మణ్, కుమారస్వామి సన్మానించారు. సబ్‌స్టేషన్ అధికారులు, ఈఆర్‌వో విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెక్షన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న విద్యుత్ ట్రాన్స్‌కో అధికారులను మంగళవారం సన్మానించారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలో గల మేడిపల్లి సెక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఏఈ ఆరెపల్లి శ్రీనివాస్, ఫోర్‌మెన్ మల్లేశం, లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పాసి నాగరాజు, ఏఎల్ఎం రమేశ్‌బాబును ఏఎల్ఎం పూర్ణచందర్‌తో పాటు సిబ్బంది సన్మానించారు.

జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిగా వేణుగోపాల్‌రావు

పెద్దపల్లిరూరల్: జిల్లా సంక్షేమశాఖ అధికారిగా పనిచేస్తున్న రవూఫ్‌ఖాన్ బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో సూపరింటెండ్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావుకు జిల్లా సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామగిరి: మండలంలోని నాగెపల్లికి చెందిన బాద్రపు బాపు ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని మంగళవారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ పరామర్శించారు.

సంక్షిప్త వార్తలు

• ప్రసన్న హరికృష్ణకు బీసీ విద్యార్థి సంఘం మద్దతు

సుల్తానాబాద్: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణకు బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికను బీసీలు సవాలుగా తీసుకొని పార్టీలకు, కులాలకతీతంగా ఏకమై బీసీ ఐక్యతను చాటాలని కోరారు. ఉమ్మడి జిల్లాల్లో బీసీల సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి హరికృష్ణ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

• బాధిత కుటుంబానికి పరామర్శ

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోడూరి రామ్మూర్తి కుమారుడు, పీఎంపీ వైద్యుడు రుక్మాంబర మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, జూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య పరామర్శించారు. నాయకులు కోడూరి మహేశ్, మల్లెత్తుల కనుకయ్య, గంగిపెల్లి శ్రీనివాస్ ఉన్నారు.

• ఇందిరమ్మ కమిటీని రద్దు చేయండి

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ ఇందిరమ్మ కమిటీ ఏర్పాటులో నిబంధనలు పాటించలేదని, వాటిని రద్దు చేసి నూతన కమిటీని నియమించాలని గ్రామానికి చెందిన తీర్దాల కొమురయ్య మంగళవారం మంథని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కమిటీ నియామకంపై విచారణ జరపాలని కోరారు.

• ఎయిడ్స్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలంతా కనీస అవగాహన పెంచుకుని వ్యాధి దరి చేరకుండా జాగ్రత్తగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్ అన్నారు. పెద్దపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్ అభిరాం, స్వప్న, మాధవి, భవాని, వరలక్ష్మి, శారద, ఆశాలు రేణుక, మరియా, రాజేశ్వరి పాల్గొన్నారు.

• జూలపల్లి ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

జూలపల్లి: మండలంలో పనిచేస్తున్న ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్ అశోక్ కమాన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. అలాగే సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సునీల్ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి బదిలీ అయ్యారు. గోదావరిఖని నుంచి ఏఈ హరీశ్, పెద్దపల్లి డివిజన్ కార్యాలయం నుంచి సబ్ ఇంజనీర్ దినేశ్ జూలపల్లికి బదిలీ చేస్తూ ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

• పొత్కపల్లి ట్రాన్స్‌కో ఏఈ..

ఓదెల: మండలంలోని పొత్కపల్లి సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఈ రాజమల్లయ్య పెద్దపల్లికి బదిలీ అయ్యారు. మంగళవారం సబ్‌స్టేషన్లో రైతులు ఏఈని సన్మానించారు.



ఫర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లలో సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి సామూహిక మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో సుభాష్ యువసేన ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నెలకొల్పిన దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను మంగళవారం వైభవంగా నిర్వహించారు. డప్పు, డోలు, చిన్నారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, మహిళల కోలాటాలు, నెత్తిన బోనాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రను తిలకించడానికి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనాలు వచ్చి కనులారా తిలకించారు. కమాన్‌పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వాహన టెండర్ల గోల్‌మాల్‌పై సీఅండ్ఎండీకి ఫిర్యాదు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లో వాహన టెండర్లలో జరిగిన గోల్‌మాల్‌పై సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు భూ నిర్వాసితులు పొన్నం బాలకృష్ణ, మేడగోని నరేందర్ తెలిపారు. సెంటనరీకాలనీలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతగా భూనిర్వాసితులకు ఉపాధి కల్పనలో భాగంగా అద్దె వాహనాల నిర్వహణకు టెండర్ అవకాశం కల్పించిందన్నారు. పారదర్శకంగా టెండర్ నిర్వహించాల్సిన డివిజన్ స్థాయి అధికారులు అర్హులను అనర్హులుగా, అనర్హులను అర్హులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. గతంలో టెండర్ ద్వారా లక్కీ డ్రాలో ఎన్ని వాహనాలు ఎంపికైనా కుటుంబానికి ఒక్కటే వాహనం అని చెప్పిన అధికారులు ప్రస్తుతం కుటుంబంలో రెండు వాహనాలకు ఎలా అనుమతి ఇచ్చారని వారు ప్రశ్నించారు. గతంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వాహనాల టెండర్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సీఅండ్ఎండీ, చీఫ్ విజిలెన్స్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సంపత్ ఆకస్మిక మరణం ఏఐటీయూసీకి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: జీడీకే–11గని పిట్ సెక్రటరీ సంపత్ ఆకస్మిక మరణం యూనియన్‌కు తీరని లోటని ఏఐటీయూసీ నేత మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోషం అన్నారు. మంగళవారం స్థానిక ఉదయ్‌నగర్‌లోని వారి ఇంటికి వెళ్లి సంపత్ పార్థివ దేహంపై అరుణ పతాకం కప్పి, పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు మాదన మహేశ్, రంగు శ్రీనివాస్, మిట్ట శంకర్, చక్రపాణి పాల్గొన్నారు.



గోదావరిఖనిటౌన్: నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

అబ్దుల్‌కలాం జయంతి

గోదావరిఖనిటౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల సమీపంలోని అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యదేవర జ్యోతి కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ మగువ ప్రెసిడెంట్ సునీత, ఉపాధ్యాయులు సత్యం, లక్ష్మి, సద్గుణ పాల్గొన్నారు. కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..

స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంజీవ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీడి కనకయ్య, అధ్యాపకులు



రామగిరి: సెంటనరీకాలనీ శ్రీపాదభవన్‌లో..

అబ్దుల్ రహమాన్, మంతెన శ్రీనివాస్, కుక్కుడపు శ్రీనివాస్, కలబోయిన శంకరయ్య, గసికంటి శంకరయ్య, కమలాకర్, శాంతా రామారావు, శారద, కలరాధ, శ్రీగోదా, జగదీశ్వరి, రమాదేవి, స్వప్న, ప్రియదర్శిని, అల్తాఫ్ పాల్గొన్నారు.

సెంటనరీకాలనీ శ్రీపాదభవన్‌లో

రామగిరి: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా సెంటనరీకాలనీలోని శ్రీపాదభవన్‌లో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు కాటం సత్యం, ఆరెల్లి కొమురయ్య, కొప్పుల గణపతి, కండె పోచం, ముస్త్యాల శ్రీనివాస్, నరేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ గ్రామ కమిటీల సభలు

ముత్తారం: మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఇందిరమ్మ కమిటీల గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో సురేశ్ తెలిపారు. ఒక్కొక్క గ్రామం నుంచి ఐదారుగురి నుంచి దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో పేర్కొన్నారు.